# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 64
పేజీలు : 08 | వెల: రూ.5/-
శనివారం
నవంబర్ 23, 2024
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net


## పారదర్శకంగా సర్వే వివరాలు



8లో..

- హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య
- పలు హాస్టళ్లలో తనిఖీలు

# లైన్ క్లియర్.. అయినట్లేనా?

## నామినేటెడ్ పదవులకు ఇంకెన్నాళ్లు ఎదురుచూపులు





- మహారాష్ట్ర ఎన్నికలు ముగియడంతో చిగురిస్తున్న ఆశలు
- నిజమైన క్యాడర్ కు పదవులు దక్కేనా..
- జంప్ జిలానీలకు వంతపాడుతున్న ఎమ్మెల్యేలు
- ఆందోళనలో ఆశావహులు

ఆషాడం పోయింది.. శ్రావణం వెళ్ళిపోయింది. కార్తికం ముగిసిపోతోంది. అయినా కాంగ్రెస్ పార్టీలో నామినేటెడ్ పదవులపై గంపెడాశలు పెట్టుకున్న వారికి మాత్రం ఎదురుచూపులు తప్పడంలేదు. మహారాష్ట్రలో ఎన్నికలు పూర్తికావడంతో ఇక తమకు లైన్ క్లియర్ అయినట్లు ఆశావహులు భావిస్తున్నారు. దశాబ్దకాలంపాటు ప్రతిపక్షంలో అనేక ఆటుపోట్లను ఎదుర్కొంటూ వచ్చిన పార్టీ కార్యకర్తలు కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో కొత్త ఉత్సాహాన్ని ప్రదర్శిస్తున్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో ఆ పార్టీ నేతలకు అధిక ప్రాధాన్యతనిచ్చిన నేపథ్యాన్ని గుర్తు చేస్తూ అదే తరహాలో తమకు తగిన గుర్తింపు ఇవ్వాలనే డిమాండ్ బలంగా వ్యక్తమవుతోంది. జంప్ జిలానీలకు కాకుండా నిజమైన కాంగ్రెస్ పార్టీ నాయకులకే పదవులు కట్టబెట్టాలంటున్నారు. అయితే స్థానిక ఎమ్మెల్యేలు మాత్రం పార్టీ కోసం కష్టపడిన వారికి తగిన ప్రాధాన్యం ఇవ్వకుండా తమ అడుగులకు మడుగులొత్తే వారికే అవకాశాలు కట్టబెట్టడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ విషయంలో అధిష్ఠానం స్పందించి మొదటినుంచి పార్టీకోసం పనిచేసిన వారికి అవకాశం కల్పించాలని కోరుతున్నారు.

– వరంగల్ వాయిస్, వరంగల్ ప్రతినిధి

వివరాలు2లో..

# మహారాష్ట్ర విజయం..
## మోడీ చరిష్మాకు నిదర్శనం



2లో..

- బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్
- వరంగల్ చౌరస్తాలో సంబురాలు



8లో..

## దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలి

పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

## ఘనంగా అనగాష్టమి వ్రతం

దత్త క్షేత్రంలో వైభవంగా నిర్వహణ



8లో..




# లైన్ క్లియర్.. అయినట్లేనా..?



- నామినేటెడ్ పదవులకు ఇంకెన్నాళ్లు ఎదురుచూపులు
- మహారాష్ట్ర ఎన్నికలు ముగియడంతో చిగురిస్తున్న ఆశలు
- నిజమైన క్యాడర్ కు పదవులు దక్కేనా..
- జంప్ జిలానీలకు వంతపాడుతున్న ఎమ్మెల్యేలు
- ఆందోళనలో ఆశావహులు

**వరంగల్ వాయిస్, వరంగల్ ప్రతినిధి :** కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో అధికారంలోకి రావడంతో నామినేటెడ్ పోస్టులపై నేతలు గంపెడాశలు పెట్టుకున్నారు. దశాబ్దకాలంగా పార్టీ కోసం పని చేసిన నాయకులు పదవులు దక్కించుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ఆషాడం పోయింది.. శ్రావణం వెళ్ళిపోయింది. కార్తికం ముగిసిపోతోంది. మహారాష్ట్ర ఎన్నికలు కూడా అయిపోయాయి. అయితే ఇంకెప్పుడు మా ఆశలు నెరవేరేదన్న ఆందోళన ఆశావహుల్లో నెలకొంది. మహారాష్ట్ర ఎన్నికలు ముగియగానే మంత్రి వర్గ విస్తరణతోపాటు నామినేటెడ్ పదవుల పందేరం నిర్వహిస్తామంటూ అధిష్టానం పెద్దలు హామీ ఇచ్చినట్టు వెంటనే పదవుల పందేరం ఉంటుందా? ఇంకేవన్నా సాకులు తెర మీదికి వస్తాయా? గాంధీభవన్ వర్గాలు ఏమంటున్నాయి? అన్న చర్చ ఇప్పుడు పార్టీ వర్గాల్లో జోరందుకుంది.

### ప్రజా పాలన విజయోత్సవాలు..

కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారం చెపట్టి డిసెంబర్ 9నాటికి ఏడాది పూర్తికావస్తున్న సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా పాలన విజయోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే వరంగల్ లో భారీ బహిరంగ సమావేశం ఏర్పాటు సక్సెస్ అయిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా పలు సభలు, సమావేశాలు నిర్వహించి ఏడాది పాటు చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించేందుకు సిద్ధపడుతోంది. అయితే పాలన చేపట్టి సంవత్సరం గడుస్తున్నా నామినేటెడ్ పదవులు ఇవ్వకపోవడంపై పార్టీ శ్రేణుల్లో నిరాశ వ్యక్తమవుతోంది. పది సంవత్సరాలపాటు బీఆర్ఎస్ పాలనలో అనేక ఒడిదుడుకులను ఎదుర్కొని పార్టీ అధికారంలోకి వచ్చేందుకు కృషి చేసినా ఆశించిన మేర గుర్తింపు లభించడం లేదన్న భావన నాయకులు, కార్యకర్తల్లో వ్యక్తమవుతోంది.

### మహారాష్ట్రతో లింకేటి..

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు ముగియడంతో.. ఇక తెలంగాణ కాంగ్రెస్ నేతల్లో ఆశలు చిగురిస్తున్నాయి. అయితే మహారాష్ట్రకు తెలంగాణకు లింకేంటి అన్న అనుమానం కొందరిలో వ్యక్తమవుతోంది. కాంగ్రెస్ అధిష్ఠానం మాత్రం మహారాష్ట్ర ఎన్నికల ఫలితాల తర్వాత, లేదంటే ముగిసిన వెంటనే తెలంగాణలోని నామినేటెడ్ పదవుల భర్తీతో పాటు కేబినెట్ విస్తరణ మీద కూడా దృష్టి పెడతామంటూ చెప్పినట్లు ఆ పార్టీలోనే చెప్పుకొంటున్నారు. ఈ ఆశకు అదే కారణం అంటున్నాయి రాజకీయ వర్గాలు.

### పెరుగుతున్న జాబితా..

నామినేటెడ్ పదవులను ఆశిస్తున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. సుదీర్ఘకాలంగా పార్టీకి సేవలందిస్తున్న తమకే అవకాశం ఇవ్వాలంటూ సీనియర్లు.. పార్టీకి సేవ చేసేందుకు వచ్చిన తమను గుర్తించాలంటూ ఇటీవల ఇతర పార్టీల నుంచి చేరిన వారు పార్టీ నాయకత్వానికి సూచిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికలతో పాటు పార్లమెంటు ఎన్నికల్లో కష్టపడ్డవారు, సీట్ల త్యాగాలు చేసిన వారు చాలామంది నామినేటెడ్ పోస్టులు ఆశిస్తున్నారు. ఇప్పటికి 37 మందికి పదవులు ఇవ్వగా.. మరో 50 నుంచి 100 మంది క్యూలో ఉన్నారు. దీంతో వీళ్ళలో ఎందరికి అవకాశాలు దక్కుతాయి? ఎప్పుడు దక్కుతాయన్న చర్చ మళ్లీ మొదలైంది.

### నిజమైన కాంగ్రెస్ వాదులకే పదవులు..

అయితే పార్టీలోకి వచ్చిన జంప్ జిలానీలకు కాకుండా నిజమైన కాంగ్రెస్ వాదులకే నామినేటెడ్ పదవులు ఇవ్వాలన్న డిమాండ్ పెరుగుతోంది. పార్టీ పవర్ లోకి రాడానికి కష్టపడిన ప్రతి నేత ప్రభుత్వంలో నామినేటెడ్ పోస్టు కోసం ఎదురుచూస్తున్నారు. పార్టీ అధికారంలోకి రాగానే పార్టీ కోసం పనిచేసిన వారికే పదవులు ఇస్తామంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని నిజమైన కాంగ్రెస్ వాదులు కోరుతున్నారు. అయితే కొందరు ఎమ్మెల్యేలు పార్టీ క్యాడర్ ను పెద్దగా పట్టించుకోవడంలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పరిస్థితులకు అనుగుణంగా పార్టీ మారిన వారికి, ఎమ్మెల్యేల అడుగులకు మడుగులొత్తే వారి పేర్లనే నామినేటెడ్ పదవులకు కోసం రికమెండ్ చేస్తున్నట్లు అసలైన కాంగ్రెస్ వాదులు ఆరోపిస్తున్నారు. పది సంవత్సరాలు ప్రతిపక్షంలో నిర్బంధాలను ఎదుర్కొన్నాం..ఇప్పుడు అధికారంలో ఉన్నా లాభంలేదన్న ఆందోళనను వారు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యేలతో పాటు అధిష్ఠానం సైతం నిజమైన కాంగ్రెస్ వాదులకు న్యాయం చేసేలా కృషి చేయాలంటున్నారు.

# మహారాష్ట్ర విజయం.. మోడీ ఛరిష్మాకు నిదర్శనం

- బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్
- వరంగల్ చౌరస్తాలో సంబురాలు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న మోడీ నాయకత్వంలోనే దేశ క్షేమం, అభివృద్ధి సాధ్యమవుతుందనే నమ్మకంతోనే మహారాష్ట్ర ప్రజలు బీజేపీకి పట్టం కట్టారని ఆ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ అన్నారు. మహారాష్ట్రలో బీజేపీ విజయఢంకా మోగించడంతో..వరంగల్ చౌరస్తాలో గంట రవికుమార్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు టపాసులు పేల్చి, స్వీట్లు పంచి సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ప్రధాని మోడీకి ఉన్న పాపులారిటీ ఏ మాత్రం తగ్గలేదన్నారు. మోడీ పాలనలోనే భారత్ అంతర్జాతీయంగా మరింత బలోపేతం అవుతుందని ప్రజలు నమ్ముతున్నారన్నారు. పేదరికం, అవినీతి, ఉగ్రవాదం వంటి పీడల నుంచి విముక్తి పొందిన నవభారత నిర్మాణం కోసం యజ్ఞం చేస్తున్న భరతమాత ముద్దుబిడ్డ మోడీ అని కొనియాడారు. కాంగ్రెస్ నాయకులు ఎన్ని కుట్రలు చేసినా.. అబండాలు మోపినా ప్రజలు మోసపోలేదన్నారు. బీజేపీకి పట్టం కట్టిన మహారాష్ట్ర రాష్ట్ర ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని నీచ రాజకీయాలు మానాలన్నారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మోడీపై అనుచిత వ్యాఖ్యలు చేశారని, ఇప్పటికైనా ఆయన కండ్లు తెరిచి మోడీకి క్షమాపణ చెప్పాలన్నారు. తెలంగాణలో ఒక్క గ్యారెంటీని సక్రమంగా అమలు చేయకుండా.. మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో అమలు చేశామంటూ అబద్ధాలు చెప్పిన తెలంగాణ సీఎంకు ప్రజలు కర్రకాల్చి వాతపెట్టరాన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, రత్నం సతీష్ షా, జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరి శంకర్, ఉపాధ్యక్షులు కనుకుంట్ల రంజిత్ కుమార్, ఎరుకుల రఘునారెడ్డి, మాచర్ల దీన్ దయాల్, రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు బైరి మురళి కృష్ణ, జిల్లా కార్యదర్శి గోకె వెంకటేష్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి గొడిశాల సూరజ్ గౌడ్, పలు డివిజన్ అధ్యక్షులు, పెద్ద ఎత్తున బీజేపీ, బీజేవైఎం కార్యకర్తలు పాల్గొన్నారు.



# విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి

**జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. అందులో భాగంగా శనివారం వరంగల్ మండల పరిధిలోని మట్టేవాడ, గిర్మాజీ పేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీ సమయంలో మట్టేవాడ హై స్కూల్, గిర్మాజిపేట హైస్కూల్ లో విద్యార్థుల సమస్యలు పరిష్కరించేందుకు పాఠశాలల్లో ఏర్పాటు చేసిన కంప్లైంట్స్ బాక్స్ ను జిల్లా కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. అందులో మధ్యాహ్న భోజన పథకంలో ఆహారం సరిగా వండడం లేదంటూ వచ్చిన కంప్లైంట్ పై వివరాలు సేకరించారు. అందుకు గల కారణాలను పరిశీలించాల్సిందిగా డీఈఓ జగదీశ్వర్ ను అదేశించారు. అపరిశుభ్రంగా ఉన్న పాఠశాల పరిసరాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని పాఠశాల ప్రిన్సిపాల్ ను అదేశించారు. నీటి ట్యాంక్ లీకేజీని అరికట్టి నీరు వృథా కాకుండా చూడాలన్నారు. పాఠశాల క్లాస్ రూముల్లో పర్యటించి విద్యార్థులతో మాట్లాడారు. భవిష్యత్ ఆలోచనలపై పిల్లలతో సంభాషించారు. పాఠశాలలోని వంటగదిని, వంట సామాగ్రి నిల్వలు గదిని పరిశీలించి ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. పిల్లల కోసం తయారు చేసిన మధ్యాహ్నం భోజనంను పరిశీలించారు. ఈ ఆకస్మిక తనిఖీల్లో వరంగల్ తాహాసిల్దార్ ఇక్బాల్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, యజమాన్యం వారి వెంట ఉన్నారు.

### డాటా ఎంట్రీ పరిశీలన..

జిల్లాలో సమగ్ర కుటుంబ సర్వే సందర్భంగా సేకరించిన వివరాలను కంప్యూటరీకణ నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని కలెక్టర్ సత్య శారద ఆదేశించారు. ఇందులో భాగంగా శనివారం వర్ధన్నపేట ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహిస్తున్న డాటా ఎంట్రీని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. సర్వే డాటా ఎంట్రీ పక్కగా జరగాలన్నారు. ఈనెల 30 లోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంట జడ్పీ సీఈవో రామ్ రెడ్డి, సీపీఓ గోవిందా రాజన్, వర్ధన్నపేట తహసిల్దార్ విజయ సాగర్, ఎంపీడీవో వెంకటరమణ, ఈడీఎం రాజకుమార్ లు పాల్గొన్నారు.

## లైఫ్ సర్టిఫికెట్లు అందజేయాలి: జిల్లా పౌరసంబంధాల అధికారి అయూబ్ ఆలీ

**వరంగల్ వాయిస్, వరంగల్ :** మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు చెందిన లబ్దిదారులకు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సంక్షేమ నిధి నుంచి ప్రతి నెల రూ.3 వేల చొప్పున పెన్షన్ మీడియా అకాడమి ద్వారా అందించడం జరుగుతుందని జిల్లా పౌరసంబంధాల అధికారి మహమ్మద్ అయూబ్ ఆలీ ఒక ప్రకటనలో తెలిపారు. కావున వరంగల్ జిల్లా పరిధిలోని జర్నలిస్టుల కుటుంబాలు ఈ సంవత్సరం 2024-2025 కు సంబంధించిన లైఫ్ సర్టిఫికేట్లను వరంగల్ జిల్లా పౌరసంబంధాల కార్యాలయంలో ఈనెల 27 లోగా అందజేయాలని ఆయన కోరారు.

# అర్హులకు న్యాయం చేసే బాధ్యత నాది

➲ పేదలకు ఇల్లు అందిస్తామన్న ఎమ్మెల్యే నాయిని



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గం పరిధిలో నిర్మించిన రెండు పడకల ఇళ్లను నిజమైన అర్హులకు ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారంగా గతంలో రెండు పడకల కోసం కేటాయించిన స్థలంలో ఉన్న అర్హులకు ఇళ్లను అందిస్తానని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. శనివారం హనుమకొండలోని అంబేద్కర్ నగర్, జితేందర్ నగర్ లలో ఎమ్మెల్యే నాయిని పర్యటించారు. నేరుగా స్థానిక ప్రజల ఆవాస గృహాలను పరిశీలించారు. నిర్మాణం చేపట్టిన చాలా ఏళ్లుగా తమ స్వార్థ రాజకీయాల కోసం, దళారుల లబ్ధి కోసం జాప్యం చేశారని మండిపడ్డారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ నాలుగు నుంచి ఐదు సార్లు జిల్లా కలెక్టర్, ఎంపీలతో చర్చలు జరిపామని, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రెండు పడకల ఇళ్లకు ప్రభుత్వం కొత్త విధివిధానాలను రూపొందిస్తున్న క్రమంలో కొద్దిగా జాప్యం



జరిగినా మాట వాస్తవమేనన్నారు. గతంలో కూడా చెప్పిన, ఎన్నికల ముందు కూడా చాలా సందర్భాల్లో చెప్పిన డబ్బులు ఇచ్చిన వాళ్లకు, అర్హులు కానీ వాళ్లకు ఇల్లు రావని మా పార్టీ వాళ్లు అయినా, ప్రతిపక్ష పార్టీ వాళ్లైనా డబ్బులు తీసుకుంటే సహించేది లేదని హెచ్చరించారు. ఇప్పటికే కలెక్టర్ కార్యాలయంలో భూ నిర్వాసితుల లబ్ధిదారుల పేర్లు ఉన్నాయని, వాళ్లకు చట్ట ప్రకారమే ఇళ్లను అందిస్తామన్నారు. పోతన నగర్, న్యూ శాయంపేట నిర్వాసితులకు ఇళ్లను అందించే బాధ్యత నాదని తెలిపారు. నేను గతంలో పాదయాత్ర చేసినప్పుడు ప్రతి ఒక్కరి సమస్య చూసిన తప్పకుండా న్యాయం చేస్తానని భరోసా ఇచ్చానని గుర్తు చేశారు. ఇళ్ల పేరుతో డబ్బులు తీసుకొని తిరిగి ఇవ్వని వాళ్లను బాజాప్తా జైల్లో పెట్టిస్తానని, మా ప్రజా ప్రభుత్వం తెరిచిన పుస్తకం లాగా పరిపాలన కొనసాగిస్తుందన్నారు. ఇల్లు రాని వారికి ఇందిరమ్మ ఇళ్ల పథకంలో చోటు కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బంక సంపత్, నాయకులు తోట పవన్, కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

## అంతర్జాతీయ కరాటే చాంపియన్ షిప్ లో సానియాకు రెండు వెండి పతకాలు



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ఈ నెల 7 నుంచి 10 వరకు గోవాలోని పెడెం స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో జరిగిన 24వ (FSKA) ఎఫ్ఎస్కే కరాటే చాంపియన్ షిప్ లో స్థానిక మహర్షి విద్యాలయంలో మూడో తరగతి చదువుతున్న మహబూబాబాద్ మండలం ఈదుల పూసపల్లికి చెందిన మహమ్మద్ సానియా అండర్-10 విభాగంలో రెండు వెండి పతకాలు సాధించింది. ఈ పోటీల్లో 25 దేశాలు పాల్గొనగా సానియా తన ఉత్తమ ప్రతిభ కనబర్చి పతకాలు కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా మహర్షి విద్యాలయం యాజమాన్యం, అధ్యాపక బృందం సానియాను అభినందించారు. ఈ సందర్భంగా తల్లి దండ్రులు షబ్బీర్-సుల్తానా మాట్లాడుతూ తమపాప కరాటేలో 5సంవత్సరాల వయసు నుంచి పాల్గొని ఇప్పటి వరకు 3 గోల్డ్ మెడల్స్, సిల్వర్ బ్రోన్జ్ తో పాటు మరెన్నో ప్రశంసా పత్రాలు సాధించిందని తెలిపారు. తమ పాపలోని ప్రతిభను గుర్తించి స్పార్క్ కరాటే అకాడమీ మాస్టర్ ఎండీ అమీర్ పాషా ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చి పోటీలలో పాల్గొనటానికి స్వయంగా తీసుకు వెళ్తారని, వారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఇలాగే మునుముందు మరెన్నో పతకాలు సాధించి మానుకోట జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## విద్యార్థులకు చిరుధాన్యాలు అందించాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** చిన్నారులు జంక్ ఫుడ్ బారిన పడకుండా చిరుధాన్యాల చిరుతిళ్లను విద్యార్థులకు అందించాలని హనుమకొండ స్మైలి డిజీ స్కూల్ కరస్పాండెంట్ మంద శ్రీనివాస్ అన్నారు. శనివారం రికార్డ్ సర్వీసెస్ సొసైటీ వారి సహకారంతో మిల్లెట్స్ డే నిర్వహించి చిరుధాన్యాల చిరుతిళ్లు విద్యార్థులకు అందించినట్లు వారు తెలిపారు. చిరుధాన్యాలు పిల్లల పెరుగుదలకు ఎంతో ఉపకరిస్తాయని, ప్రతి నిత్యం ఇవి తీసుకోవడం వల్ల విద్యార్థులు మానసికంగా శారీరకంగా దృఢంగా పెరుగుతారని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. సొసైటీ అధ్యక్షుడు కుసుమ సురేష్ మాట్లాడుతూ పాఠశాల చిన్నారుల కోసం సుమారు 50 రకాల చిరుతిళ్లు మిల్లెట్ హబ్ ద్వారా అందిస్తున్నట్లు, ఇవే కాక అన్ని రకాల ఉత్పత్తులు తమ వద్ద లభిస్తున్నట్లు తెలిపారు. చిరుధాన్యాలతో చిరుతిళ్లు తిన్న పిల్లలు చాలా బాగున్నాయని వారి సంతోషాన్ని వ్యక్తం చేశారు. ప్రతిరోజు క్రమం తప్పకుండా ఈ చిరుతళ్లనే తినాలని కుసుమ కవిత చిన్నారులకు హితవు పలికారు. ఈ కార్యక్రమంలో మిల్లెట్ కుకింగ్ ఎక్స్పర్ట్ కుసుమ కవిత, ప్రముఖ సామాజిక వేత్త మిల్లెట్ ప్రమోటర్ నిమ్మల శ్రీనివాస్, పావని, త్రివేణి స్వప్న తదితరులు పాల్గొన్నారు.

# 26న రైతు కార్మిక సంఘాల ర్యాలీ

**వరంగల్ వాయిస్, వరంగల్ :** కేంద్ర, బీజేపీ ప్రభుత్వ రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై విధానాలను నిరసిస్తూ ఈనెల 26న వరంగల్, రైల్వే స్టేషన్ నుంచి చౌరస్తా వరకు జరుగు రైతు కార్మిక సంఘాల ర్యాలీని జయప్రదం చేయాలని కోరుతూ రైతు కార్మిక సంఘాల నాయకులు వరంగల్ కూరగాయల మార్కెట్ లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. మార్కెట్ లోని కార్మికులకు కూరగాయల కొనుగోలు చేసేందుకు వచ్చిన ప్రజలకు వారు కరపత్రాలు పంచారు. ఈ కార్యక్రమానికి , గంగుల దయాకర్ అధ్యక్షత వహించగా వీరగోని శంకరయ్య గోనె కుమారస్వామి, సోమిడి శ్రీనివాస్, రాచర్ల బాలరాజు, ముక్కెర రామస్వామి, గన్నారపు రమేష్ లు మాట్లాడారు. రైతులందరికీ పూర్తిగా పంట రుణాలు మాఫీ చేయాలని, రైతు వ్యతిరేక మూడు, నల్ల చట్టాలను రద్దు చేయాలని, నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, నెలకు కనీస వేతనం రూ.26,000గా ఇవ్వాలని, ప్రభుత్వ రంగ సంస్థల, ప్రైవేటీకరణ




ఆపాలని, భూసేకరణ చట్టం-2013ను అమలు చేయాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, మహిళలు, దళితులు, గిరిజనులు, మైనారిటీలపై జరుగుతున్న దాడులను, హత్యలను, అత్యాచారాలను అరికట్టాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏం సాగర్, సుధమల్ల భాస్కర్, ఎంఏ పాషా, ఓదెల రాజయ్య పాల్గొన్నారు.

## పశు వైద్య శిబిరం




**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** మండలంలోని బూరుగుపాడు గ్రామంలో శనివారం పశుసంవర్ధక శాఖ, పశు గణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పశు వైద్య చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. డోర్నకల్ మండల పశువైద్యాధికారి డా.నాగేశ్వర రావు ఈ శిబిరంలో 38దూడలకు నట్టల నివారణ మందు, 5 పశువులకు కృత్రిమ గర్భధారణ, 56 పశువులకు గర్భకోశం వ్యాధుల చికిత్స, 10 అనారోగ్య పశువులకు చికిత్స చేయడం జరిగింది. మొత్తం 117 పశువులకు వైద్యం అందించారు. కురవి పశు వైద్యాధికారి డాక్టర్ రాజేందర్ మాట్లాడుతూ కేవలం ఆడ దూడలు పుట్టే వీర్యంను ఉపయోగించుకోవాలన్నారు. రైతులు కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా రుణాలు పొందుటకు పశువైద్యశాలలో సంప్రదించాలని కోరారు. సూపర్ వైజర్ రఘువీర్, చంద్రయ్య, గోపాలమిత్రలు లింగయ్య, రవీందర్, హరికిషన్, రైతులు రామిరెడ్డి, శ్రీనివాస్, వెంకన్న పాల్గొన్నారు.

## 'నీటిని పొదుపుగా వాడుదాం'




**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రాణకోటి జీవించడానికి నీరే ప్రధానమని, ప్రతీ ఒక్కరు నీటిని పొదుపుగా వాడాలని ఎంజేపీ గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ జనగామ అంజిరెడ్డి, ఎన్ సీసీ ఆఫీసర్లు సత్యనారాయణ, నరేంద్ర కోరారు. శనివారం వరంగల్ ఉర్సుగుట్టలోని ఎంజేపీటీబీసీడబ్ల్యూ గురుకులం విద్యార్థినులు 77వ ఎన్ సీసీ ఆవిర్భావ ఉత్సవాలను పురస్కరించుకొని భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్సీసీ విద్యార్థినులు బ్యానర్లు చేత పట్టుకుని నీటిని కాపాడుదాం, పచ్చదనాన్ని పెంపొందిద్దాం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదామంటూ నినదించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంచి నీటిని ఇప్పుడు వృథా చేస్తే భవిష్యత్‌లో తాగడానికి నీరు లభించదని పేర్కొన్నారు. అందరూ విరివిగా మొక్కలు నాటాలని సూచించారు. మొక్కలు చెట్లు అయి మంచి వాతావరణాన్ని ఇస్తాయన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడం ద్వారానే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌వో మానస, అధ్యాపకులు, పీఈటీలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## నాణ్యమైన భోజనం అందించాలి



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో రఘునాథపల్లి మండలం కేంద్రంలో అశ్వరావు పల్లి గ్రామంలో ఉన్నత పాఠశాలలో ఎంఈఓ రఘునందన రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేయడం జరిగింది. అనంతరం ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి పొదల లవకుమార్ మాట్లాడుతూ రఘునాథపల్లి మండల కేంద్రంలో ఉన్న ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు నిబంధనలకు విరుద్ధంగా అధిక స్పీడుతో, అటెండర్లు లేకుండా స్కూల్ బస్సులు నడిపిస్తున్నారని, అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా చూసుకుంటే మధ్యాహ్న భోజనంతో ఫుడ్ పాయిజన్ అయి చాలా మంది విద్యార్థులు ఇబ్బందులు పడిన సందర్భాలు ఉన్నాయిని తెలిపారు. తక్షణమే రఘునాథపల్లి మండల కేంద్రంలోని పాఠశాలలను సందర్శించి మధ్యాహ్న భోజనం తనిఖీలు చేయాలన్నారు. అదేవిధంగా పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ బిల్లులు పెంచాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అక్షిత్, రమేష్, సన్నీ పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం తనిఖీ



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎఫ్ఏక్యూ నామ్స్ ప్రకారం ధాన్యం కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.వీర బ్రహ్మచారి అన్నారు. శనివారం మహబూబాబాద్ మండలం ముడుపుగల్ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో నడుస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సూచనల ప్రకారం ఎఫ్ఏక్యూ నామ్స్ ను అనుసరించి రైతులు శుద్ధి చేసిన ధాన్యం మ్యాచ్చర్ వచ్చిన తర్వాత కొనుగోలు కేంద్రాలకు తీసుకు వస్తే బాగుంటుందని, అందుకు మండల వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కేంద్రం నుంచి కొనుగోళ్లు చేసిన ఆరు లారీల ధాన్యాన్ని తరలించడం జరిగిందని, రైతులు పూర్తిగా నిబంధనలు పాటిస్తూ, అధికారులకు సహకరించి ధాన్యాన్ని తీసుకురావాలన్నారు.ధాన్యం కొనుగోలుపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ వహించి నిత్యం పర్యవేక్షించడం జరుగుతుందని, రైతులకు కొనుగోలు కేంద్రాల వారికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని చర్యలు తీసుకున్నామని అదనపు కలెక్టర్ అన్నారు. ఈ తనిఖీల్లో అదనపు కలెక్టర్ వెంట డీఎస్ఓ ప్రేమ్ కుమార్, ఏపీఎం తదితరులు ఉన్నారు.

## ఘనంగా ఆర్ఎస్పీ జన్మదిన వేడుకలు



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండల కేంద్రంలో డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ జన్మదిన వేడుకలు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ ఎర్రబెల్లి రాజేశ్వరరావు, మాజీ రైతు బంధు మండల కోఆర్డినేటర్ చిన్నపాక శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ మాడుగుల రాజు, మండల సీనియర్ నాయకులు కరిమిల్ల దుర్గారావు, మాజీ సర్పంచ్ ఏర్పుల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ అమడగాని రాజు, పట్టణ అధ్యక్షుడు మెరుగు వెంకన్న, యూత్ అధ్యక్షులు బూర శ్యామ్, మహిళా అధ్యక్షురాలు బరిగల విజయ, తదితరులు పాల్గొన్నారు.

## గౌడ కార్తీక వనభోజన కార్యక్రమాన్ని విజయవంతం చేయండి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఖిలా వరంగల్ చిల్డ్రన్ పార్క్ లో రేపు ఆదివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరుగు 22వ, గౌడ కార్తీక వనభోజన కార్యక్రమానికి వరంగల్ ఉమ్మడి జిల్లాలోని గౌడ సోదరులందరూ మీ కుటుంబ సభ్యులతో హాజరు కావాలని గోపా హనుమకొండ జిల్లా గౌరవ అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్ గౌడ్, కొండా సురేఖ, ధనసరి సీతక్క, టీపీసీసీ అధ్యక్షుడు బండి మహేష్ కుమార్ గౌడ్ వస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాకారులచే సాంస్కృతి కార్యక్రమాలు, పిల్లలకు, పెద్దలకు వివిధ రకాల ఆటల పోటీలు ఉంటాయన్నారు. రాష్ట్రంలో ఎంతో పేరుగాంచిన ఖిలా వరంగల్ లో జరుగుతున్న ఈ గౌడ కార్తీక వనభోజన కార్యక్రమానికి వరంగల్ ఉమ్మడి జిల్లాలోని గౌడ సోదరులందరూ పెద్ద సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# గ్రూప్-2 ఎగ్జామ్ పై అవగాహన సదస్సు



**వరంగల్ వాయిస్, మరిపెడ :** స్థానిక గవర్నమెంట్ డిగ్రీ కాలేజీలో కెరీర్ గైడెన్స్ సెల్, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గ్రూప్–II ఎగ్జామ్ పై అవేర్నెస్ ప్రోగ్రాం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పోటీ పరీక్షలకు ప్రిపేరయ్యే అభ్యర్థులను ఉద్దేశించి ప్రిన్సిపాల్ టి.జవన్ కుమార్ మాట్లాడుతూ పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న విద్యార్థులు, మన కళాశాలలో ఉన్న విద్యార్థులు ఒక గోల్ సెట్ చేసుకోవాలని, దాని కోసం నిరంతరం కష్టపడాలన్నారు. అలాగే మన కళాశాలలో ఉన్న టీచింగ్ సిబ్బంది ద్వారా గ్రూప్స్ ఎగ్జామ్స్ పై పట్టు సాధించాలని చెప్పటం జరిగింది. కెరీర్ గైడెన్స్ సెల్ ఇంచార్జి వెంకటరమణ మాట్లాడుతూ పోటీ పరీక్షలకు ఎలా ప్రిపేరవ్వాలి, గ్రూప్స్ పై టార్గెట్ ఉండాలని, రాబోయే రోజుల్లో మరిన్ని అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి విద్యార్థులు మంచి ఉద్యోగాలలో స్థిరపడేటట్లుగా చేస్తానని అన్నారు. ఎన్ఎస్ఎస్ ఇంచార్జి డాక్టర్ జి.వెంకయ్య మాట్లాడుతూ మరిపెడ పరిసర ప్రాంతంలో గ్రూప్స్ కు ప్రిపేరయ్యే అభ్యర్థులకు సిలబస్ పై ఎలా పట్టు సాధించాలని, పేపర్–2, పేపర్ 4 సిలబస్ పై అవగాహన కల్పించడం జరిగింది. అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ జనరల్ సైన్స్, సైన్స్ అండ్ టెక్నాలజీని అవగాహన చేసుకోవడానికి వాటిపై కొన్ని టెక్నిక్స్ చెప్పటం జరిగింది. ఇంకా మిగతా సిబ్బంది డాక్టర్ షేట్ రామ్ ఎకానమీపై డా.వరలక్ష్మి జనరల్ ఇంగ్లీష్ పై డా.నరసింహారావు అనలిటికల్ రీజనింగ్, అర్థమేటిక్ పై, సురేందర్ రెడ్డి బయాలజీపై, లక్ష్మి భారత రాజ్యాంగంపై విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగింది. పరిసర ప్రాంతాల నుంచి నిరుద్యోగ అభ్యర్థులు కూడా పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్కె యాకూబ్, రమాదేవి, కొమరయ్య, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రియాంక గాంధీ కృషిని గుర్తించిన కేరళ ప్రజలకు ధన్యవాదాలు

### రావుల వెంకట రమేష్ గౌడ్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వాయినాడు ప్రజలకు సేవ చేయాలని ఆలోచనతో ప్రియాంక గాంధీ ఎన్నికల్లో పోటీ చేశారని ప్రియాంక గాంధీ కృషిని గుర్తించి అత్యధిక మెజార్టీతో గెలిపించిన కేరళ ప్రజలకు కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు టీపీసీసీ గీత సెల్ సెక్రెటరీ రావుల వెంకట రమేష్ గౌడ్ పేర్కొన్నారు. ప్రజలు ఏం కోరుకుంటే అదే జరుగుతుందని రాహుల్ గాంధీని ఆశీర్వదించినట్లే సోదరి ప్రియాంకను వాయినాడు ప్రజలు ఆదరించారన్నారు. అత్యధిక మెజార్టీతో గెలిచిన ప్రియాంక గాంధీకి తెలంగాణ రాష్ట్ర ప్రజల పక్షాన వెంకట రమేష్ గౌడ్ అభినందనలు తెలిపారు.

## లైఫ్ సర్టిఫికెట్లు అందజేయాలి

### డీపీఆర్ఓ పి.రాజేంద్రప్రసాద్



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సంక్షేమ నిధి నుంచి మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు చెందిన లబ్ధిదారులకు ప్రతి నెల రూ.3000/–ల చొప్పున పెన్షన్ మీడియా అకాడమీ ద్వారా అందించడం జరుగుతుంది. జిల్లాలోని జర్నలిస్టుల కుటుంబాలు ఈ సంవత్సరం 2024–2025కు సంబంధించిన లైఫ్ సర్టిఫికెట్లను జిల్లా పౌర సంబంధాల కార్యాలయానికి ఈ నెల 26 లోపు అందజేయవలసిందిగా జిల్లా పౌరసంబంధాల అధికారి, పి.రాజేంద్రప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

## 25న శివపార్వతుల కల్యాణం



**వరంగల్ వాయిస్, గణపురం :** మండల కేంద్రంలోని కాకతీయుల రెడ్డి గుడి శివాలయంలో ఈనెల 25న శివపార్వతుల కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరుగును దేవాలయ కమిటీ తెలిపారు. గణపురంలో ఊరేగింపు అనంతరం అన్నదానం కార్యక్రమం జరుగుతుందని దేవస్థాన కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

## మంత్రి సీతక్కకు ఘన సన్మానం



**వరంగల్ వాయిస్, గణపురం :** మంత్రి సీతక్కను శనివారం గణపురంలో ఘనంగా సన్మానించారు. భూపాలపల్లిలో వివాహ మహోత్సవానికి ప్రత్యేక అతిథిగా గణపురం మీదుగా వెళ్తున్న సీతక్కను ఆపి పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆర్.రాజేందర్, అశోక్, కె .శ్రీనివాస్ ,బి .కృష్ణ , ఈ.వెంకటేశ్వర్లు, వి.భువన సుందర్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా స్థాయి దివ్యాంగుల ఆటల పోటీలు



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ప్రతి ఏటా డిసెంబర్ 3న అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించే క్రమంలో శనివారం మహిళ, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహబూబాబాద్ పట్టణంలోని ఎన్.టీ.ఆర్. స్టేడియంలో జిల్లా స్థాయి దివ్యాంగుల ఆటల పోటీలను జిల్లా సంక్షేమ అధికారి శిరీష ప్రారంభించి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలు మనోధైర్యాన్ని, మానసిక ఉల్లాసాన్నిపెంపొందిస్తాయన్నారు. దివ్యాంగులతో క్యారమ్స్, చెస్, షార్ట్ పుట్ వేసి దివ్యాంగులను ప్రోత్సాహపరిచారు. అదేవిధంగా ఈ క్రీడల్లో గెలుపొందిన వారు రాష్ట్రస్థాయిలో జరగబోయే రాష్ట్రస్థాయి క్రీడల పోటీలో పాల్గొని జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. దివ్యాంగులను ప్రోత్సహించడంలో భాగంగా ప్రతి ఏటా జిల్లా స్థాయిలో క్రీడా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని కేటగిరి వైజ్ సీనియర్స్, జూనియర్స్ విజేతలు ఎంపిక చేసి విజేతలకు బహుమతులు అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ యూత్ అండ్ స్పోర్ట్స్ ఆఫీసర్ ఓ.జ్యోతి, పీఈటీలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, దివ్యాంగుల అసోసియేషన్స్ సభ్యులు బొర్ల ఉపేందర్ గౌడ్, మలుసురు, సయ్యద్ ఖాజ, రషేదా, యాకూబ్ పాషా, వినోద్ రెడ్డి, కృష్ణయ్య, వి.సాగర్, సుదర్శన్, రమేష్, సిబ్బంది బి.రాజు, పి.వెంకన్న, భిక్షపతి, వర ప్రసాద్ పాల్గొన్నారు.

# ప్రతీ రైతు కుటుంబం ఆనందంగా ఉండాలి

## ◆ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



**వరంగల్ వాయిస్, పరకాల :** పరకాల పరిధిలోని సంగెం, ఊకల్, కాపుల కనపర్తి రైతు సహకార సంఘాల పాలక వర్గాల సభ్యులతో శనివారం పరకాల శాసన సభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి హనుమకొండ జిల్లా భీందేవరపల్లి మండలంలోని ముల్కనూరు గ్రామంలో ఉన్న ముల్కనూర్ సహకార గ్రామీణ బ్యాంక్ ను సందర్శించి పరిశీలించారు. అనంతరం ముల్కనూర్ సహకార గ్రామీణ బ్యాంక్ సమావేశం మందిరంలో ముల్కనూరు సొసైటీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే ఏ ప్రవీణ్ రెడ్డి బ్యాంకు అభివృద్ధి చెందిన తీరును ప్రొజెక్టర్ ద్వారా వివరించారు. ప్రతీ రైతు సహకార సంఘం పాలక మండలి సభ్యులు నిబద్ధతతో పని చేసి ఎమ్మెల్యే రేవూరి ఆలోచనలకు అనుగుణంగా పని చేసి రైతుల సంక్షేమానికి సంఘం అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ రైతుల కోసం రైతులు ఏర్పాటు చేసుకున్న వ్యవస్థే రైతు సహకార వ్యవస్థ అని రైతు శ్రేయస్సు కోసం విశ్వనాథరెడ్డి ముల్కనూర్ సొసైటీ ఏర్పాటు చేశారన్నారు. ముల్కనూర్ సొసైటీ 1956లో 379 మంది సభ్యులతో ఏర్పడ్డ సొసైటీ నేడు 7641మంది సభ్యులుకు చేరిందని, సుమారు 18కోట్ల మూలధనంతో అభివృద్ధి చెందిందన్నారు. వ్యవసాయం పట్ల నిబద్ధత, రైతుల అవసరాలకు అనుగుణంగా రుణాల మంజూరు, వ్యవసాయ పరికరాలు, విత్తనాలు, ఎరువుల సరఫరా చేయడం రైతుల పంటలను తగిన ధరలకు విక్రయించే అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు. సొసైటీ లు రాజకీయాలకు నిలయంగా మారి వాటిని నిర్వీర్యం చేస్తున్నారని, రాబోయే రోజుల్లో రాజకీయాలకతీతంగా పాలక వర్గం ఏర్పాటు చేయాలనే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఆలోచనలో ఉందని అన్నారు. అనంతరం ముల్కనూరు సొసైటీ నిర్వహణలో ఉన్న కాటన్ గోదాం, జిన్నింగ్ మిల్, ముల్కనూర్ డైరీ నిర్వహణ తీరును పరిశీలించారు.

# పూజారి సాంబయ్యకు జీవన సాఫల్య పురస్కారం



**వరంగల్ వాయిస్, జమ్మికుంట :** కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని సరస్వతి శిశుమందిర్, విద్యారణ్య ఆవాస విద్యాలయం పూర్వ విద్యార్థులు రేపు ఆ విద్యాసంస్థల పూర్వ ప్రధానాచార్యులు పూజారి సాంబయ్యకు జీవన సాఫల్య పురస్కారంతో సత్కరించనున్నారు. జమ్మికుంటలో సరస్వతి శిశుమందిర్, విద్యారణ్య ఆవాస విద్యాలయాలను ఏర్పాటు చేసి ఎందరో విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది సమాజానికి చేసిన ఎనలేని కృషికి గుర్తింపుగా పూర్వ విద్యార్థులు డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆవాల రాజిరెడ్డి, తెల్ల రాజమౌళి, ముక్క జితేందర్ ఆయనకు 75 ఏళ్లు నిండిన సందర్భంగా జీవన సాఫల్య పురస్కారంతో సన్మానించనున్నారు. ఈ కార్యక్రమం జమ్మికుంట పట్టణంలో శ్రీ విద్యారణ్య ఆవాస విద్యాలయయంలో నిర్వహిస్తున్నారు. ఈ కార్యమానికి పూర్వవిద్యార్థులు, బంధు మిత్రులు భారీగా తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

# ఎస్ఎఫ్ఐ సభ్యత్వ నమోదు



**వరంగల్ వాయిస్. నడికూడ :** మండలం రాయపర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్ఎఫ్ఐ సభ్యత్వ నమోదు కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కళ్యాణ్ మాట్లాడుతూ చదువుతూ పోరాడు, చదువుకై పోరాడు నినాదంతో నిరంతరం విద్యారంగ సమస్యల పరిష్కారానికి పోరాడుతున్న ఎస్ఎఫ్ఐలో చేరాలని పిలుపునిచ్చారు. దేశంలో ప్రజాతంత్ర విద్యార్థులను నిర్మిస్తున్న ఎస్ఎఫ్ఐలో భాగస్వాము అవడం అంటే దేశ నిర్మాణంలో పాల్గొన్నట్లు అని తెలిపారు. స్వతంత్రం, ప్రజాస్వామ్యం, సోషలిజం సాధనకై ఎస్ఎఫ్ఐ పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పరకాల పట్టణ అధ్యక్షుడు బొచ్చు ఈశ్వర్, విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం

## ● డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తిరుపతి




**వరంగల్ వాయిస్, పరకాల :** పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్ షిప్ విడుదల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం వల్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే పెండింగ్ లో ఉన్న ఫీజులు విడుదల చేయాలని భారత ప్రజాతంత్ర, యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) హనుమకొండ జిల్లా కార్యదర్శి డి.తిరుపతి డిమాండ్ చేశారు.శనివారం పరకాలలో జరిగిన డీవైఎఫ్ఐ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత మూడు సంవత్సరాల నుంచి పెండింగ్ లో ఉన్న ఫీజులు విడుదల కాకపోవడంతో, విద్యార్థులు ఫీజులు కట్టలేక, చదువు కొనలేక ఇబ్బందులు పడుతున్నారు. పెండింగ్ లో ఉన్న బిల్లులు విడుదల చేసే ప్రభుత్వం విద్యార్థుల ఫీజులు విడుదల చేయడంలో మాత్రం ఎందుకు నిర్లక్ష్యం వహిస్తుందని ప్రశ్నించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో ఫీజులు పెండింగ్ లో ఉండడం వల్లే విద్యార్థులకు ఈ పరిస్థితి వచ్చిందని, ప్రాజెక్టుల పేరుతో కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టిన ప్రభుత్వం విద్యార్థులను మాత్రం మొండి చెయ్యి చూపింది. ఎన్నికల ముందు పెండింగ్ లో ఉన్న ఫీజులు అన్ని విడుదల చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం హామీని నెరవేర్చలేదని, ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని, కాంగ్రెస్ ప్రభుత్వ పాలన సంవత్సర కాలం అవుతున్న విద్యార్థుల ఫీజు రీయింబర్స్ మెంట్ విడుదల మాత్రం మాట దాటవేస్తుందని, దీంతో విద్యార్థుల పరిస్థితి అగమ్య గోచరంగా మారిందన్నారు. ఈ సమావేశంలో డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఓర్సు చిరంజీవి, నాయకులు జి.శివ శంకర వరప్రసాద్, ఎన్.విజేందర్ రెడ్డి, ఎస్.సాయి మనోజ్, ఓ. అంజి, డి.జాషువా, బి.భరత్, జి.సత్యశోధక్, వెంకటేష్, మహేష్ చంద్ర, నూరుద్దీన్ జాన్ పాల్గొన్నారు.

# కుక్కలను పట్టుకున్న మున్సిపల్ సిబ్బంది



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** డివిజన్ లో విపరీతంగా కుక్కల బెడద ఉన్నందున మహానగర పాలక సంస్థ ఆధ్వర్యంలో 15 కుక్కలను పట్టడం జరిగిందని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి తెలిపారు. డివిజన్ లోని ప్రజలు ఒంటరిగా రోడ్లపై వెళ్లలేక పోతున్నామని కార్పొరేటర్ మరుపల్ల రవికి ఫిర్యాదు చేయగా అయన వెంటనే స్పందించి సంబంధిత అధికారులకు తెలియజేయగా సిబ్బంది విచ్చేసి ఉర్సు, ప్రతాప్ నగర్, వాటర్ ట్యాంక్, నానామియా, తోట రామస్వామి టెంపుల్, కరెంట్ ఆఫీస్ ప్రాంతాలలో 15 కుక్కలను పట్టుకొని పోయారన్నారు. జవాన్ లు పోలేపాక కొమురెల్లి, ప్రశాంత్ లు ఉన్నారు.

# రోడ్డుపై చెట్ల కొమ్మలను తొలగిస్తాం



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** ఉర్సు బై పాస్ రోడ్డులో చేపల మార్కెట్ కు ఎదురుగా ప్రగతి నగర్ కాలనీ నుంచి వచ్చు వాహనదారులకు బై పాస్ రోడ్డుపై వెళ్లు వాహనాలు కనబడక ప్రమాదాలు జరుగుతున్నాయని కాలనీ కమిటీ 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవికి తెలుపగా వెంటనే శానిటరీ ఇన్ స్పెక్టర్ లింగాల కుమారస్వామితో కలిసి పరిశీలించగా రోడ్డుపై ఉన్న చెట్టు కొమ్మలు అడ్డుగా ఉండటాన్ని గ్రహించి అడ్డుగా ఉన్న కొమ్మలను తొలిగింపజేస్తామని కార్పొరేటర్ మరుపల్ల రవి తెలిపారు. ప్రగతి నగర్ కాలనీ కమిటీ ప్రతినిధులు భూక్యా వీరన్న, బానోతు భద్రు, అన్న శ్రీనివాస్, గౌడ రామ్, విజయ్, పోలేపాక కొమురెల్లి, ప్రశాంత్ లు ఉన్నారు.

# గౌడ కార్తీక మాస వన భోజనాలకు మంత్రి పొన్నంకు ఆహ్వానం



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** గోపా హనుమకొండ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చిర్ర రాజు గౌడ్ నేతృత్వంలో ఖిలా వరంగల్ మధ్య కోటలో గల చిల్డ్రన్ పార్క్ లో ఆదివారం నిర్వహించే గౌడ కార్తీక మాస వనభోజనాలకు రావాల్సిందిగా బీసీ సంక్షేమ శాఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ను హైదరాబాద్ లోని మంత్రి స్వగృహంలో కలిసి ఆహ్వాన పత్రాన్ని అందించారు. ఆహ్వాన పత్రికను అందించిన వారిలో గోపా హనుమకొండ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చిర్ర రాజు గౌడ్ తో పాటు తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొనగాని యాదగిరి గౌడ్, తెలంగాణ గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు మండ వెంకన్న గౌడ్, గోపా నాయకులు హరీష్ గౌడ్, మణికంఠ గౌడ్ ,రమేష్ గౌడ్ తదితరులున్నారు.

# గౌర్రెల కాపరి ఆత్మహత్య

**వరంగల్ వాయిస్, గణపురం :** స్థానిక బస్టాండ్ లో శనివారం మధ్యాహ్నం గణపురానికి చెందిన గౌర్రెల కాపరి అమ్మ కొమురయ్య (65) అనే వృద్ధుడు క్రిమి సంహారక మందు తాగి ఆత్మ హత్యకు పాల్పడ్డాడు. విషయం తెలిసిన ఎస్ఐ రేఖ అశోక్ కుటుంబ సభ్యుల నుంచి ఫిర్యాదు తీసుకొని దర్యాప్తు చేస్తున్నారు. భూపాలపల్లి 100 పడకల ఆసుపత్రికి శవ పంచనామా నిమిత్తం పంపించినట్లు పోలీసులు తెలిపారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
శనివారం, నవంబర్ 23, 2024

# పీడీఎస్ బియ్యం పట్టివేత



**వరంగల్ వాయిస్, క్రైం :** అక్రమంగా పీడీఎస్ బియ్యాన్ని డంప్ చేస్తున్నారనే విశ్వసనీయ సమాచారంతో పరకాల పోలీస్ స్టేషన్ పరిధిలోని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పరకాల పోలీసులతో కలిసి పిల్లల మర్రి రాజు, వరికోల్, నడి కూడ మండలం లోని చరంతేజ్ పౌల్ట్రీ ఫారమ్ యజమాని వద్దకు చేరుకొని ఫారంలో ఉన్న 12 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.31,200 సదరు ఫారం యజమాని నడికూడ మండలం చుట్టుపక్కల గ్రామాల నుంచి పీడీఎస్ రైస్ కొనుగోలు చేసినట్లు విచారణలో తేలింది. అలాగే పరకాల పోలీసులతో కలిసి టాస్క్ ఫోర్స్ బృందం శ్రీ రాజేశ్వర ఫౌల్ట్రీ ఫారం యజమాని బొల్లం జనార్ధన్ రెడ్డి, వరికోల్, నడికూడ మండలం బండి శంకర్ చర్లపల్లి గ్రామ ఫారంలో పరకాల పీఎస్ పరిధిలోకి వచ్చి 25 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.65,000 ఉంటుందని, సదరు ఫారం యజమాని నడికూడ మండలం చుట్టుపక్కల గ్రామాల నుంచి పీడీఎస్ రైస్ కొనుగోలు చేసినట్లు విచారణలో తేలింది. నిందితులతో పాటు స్వాధీనం చేసుకున్న ఆస్తులను తదుపరి చర్యల నిమిత్తం పరకాల పోలీసులకు అప్పగించారు. ఈ తనిఖీలో టాస్క్ ఫోర్స్ ఇన్ స్పెక్టర్ ఎస్.రాజు, ఆర్ఎస్సై .భానుప్రకాష్, టాస్క్ ఫోర్స్ టీమ్, పరకాల ఎస్సై రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

# మహబూబాబాద్ జిల్లా పోలీసుల ఉత్తమ ప్రతిభ

## డీజీపీ చేతుల మీదుగా రివార్డ్స్



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** తెలంగాణ రాష్ట్ర డీజీపీ కార్యాలయంలో నిర్వహించిన రివార్డ్ మేళాలో రాష్ట్ర వ్యాప్తంగా గంజాయి కేసులలో ఎక్కువ కన్విక్షన్స్ మహబూబాబాద్ జిల్లాకు వచ్చినందుకు గాను తెలంగాణ రాష్ట్ర డీజీపీ జితేందర్ చేతుల మీదుగా రివార్డ్స్ అందుకోవడం జరిగింది. ఈ సందర్భంగా మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లాలో గంజాయి కేసులకు సంబంధించి ఎక్కువ కన్విక్షన్స్ రావడం అభినందనీయమన్నారు. ఒక కేసులో దొషికి శిక్ష పడాలంటే కోర్ట్ డ్యూటీ ఆఫీసర్ నుంచి స్టేషన్ అధికారుల వరకు సాక్షులను ప్రవేశపెట్టడంలో, దర్యాప్తు చేయడంలో ఎంతో శ్రమపడాల్సి ఉంటుందన్నారు.గంజాయి కేసులలో కన్విక్షన్స్ రావడంలో ప్రతిభ కనపరిచిన సిబ్బంది అధికారులకు ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మహబూబాబాద్ రూరల్ సీఐ సరవయ్య, మరిపెడ ఎస్ఐ సతీష్, బయ్యారం ఎస్ఐ తిరుపతి, తెలంగాణ రాష్ట్ర డీజీపీ చేతుల మీదుగా రివార్డ్స్ అందుకున్నారు.

# బాధిత కుటుంబ సభ్యులకు చెక్కు అందజేత



**వరంగల్ వాయిస్, బాలసముద్రం :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని 48వ డివిజన్ చెందిన రామిండ్ల విజయకుమార్ ఇటీవల ప్రమాదవశాత్తు విద్యుత్ ఘాతంతో మరణించారు. దీంతో విద్యుత్ శాఖ వారు రాష్ట్ర ప్రభుత్వ పరంగా ఎక్స్ గ్రేషియా రూ.5 లక్షల చెక్కును వారి కుటుంబ సభ్యులకు శనివారం బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ట్రాన్స్ కో అధికారులతో కలిసి పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట మాజీ కార్పొరేటర్ అబుబాకర్, డివిజన్ అధ్యక్షుడు సింగారపు రవి ప్రసాద్, నాయకులు ఇప్ప శ్రీకాంత్, దొంగల కుమార్, విద్యుత్ శాఖ అధికారులు ఏడీ సుబ్రహ్మణ్యం, ఏఈ శ్రీధర్, తదితరులు ఉన్నారు.

# అన్ని దానాల్లో కెల్లా రక్త దానం గొప్పది

## ◆ ఎన్సీసీ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** స్థానిక లాల్ బహుదూర్ కళాశాలలో ఎన్సీసీ పదవ తెలంగాణ బెటాలియన్ ఆధ్వర్యంలో బెటాలియన్ కమాండింగ్ అధికారి ఎస్ఎస్ రామదుర్రై ఆజ్ఞ మేరకు నగరంలోని వివిధ కళాశాలల ఎన్సీసీ క్యాడేట్లు ఎన్సీసీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డి హెచ్ రావు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ దేశ సేవ కోసం సిద్ధంగా ఉన్న ఎన్సీసీ క్యాడేట్లు ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఇతర మానవులకు రక్తదానం చేయడం అభినందించ తగిన విషయమననారు. ఎన్సీసీ పదవ తెలంగాణ బెటాలియన్ అధికారుల సూచన మేరకు ఇంత పెద్ద ఎత్తున మెగా ఉచిత రక్తదానం శిబిరం మా కళాశాల నిర్వహించడం గర్వకారణమని తెలిపారు. ప్రజల్లో రక్తదానంపై అవగాహన తీసుకురావాలని ఇందులో చురుకైన పాత్ర నిర్వహించాలన్నారు. రక్తదాన చేయడం అంటే ప్రాణదానం వారవుతారని, అన్ని దానాలలో కెల్లా రక్త దానం గొప్పదన్నారు. ఎంతోమంది పేదలు మాత్మ గాంధీ హాస్పిటల్ వైద్యశాలలో రక్తం అందక ప్రాణాలు వదులుతున్నారని, వారి ప్రాణాల కోసం రక్తం ఇవ్వడానికి ముందుకొచ్చిన విద్యార్థులను అభినందించారు. రక్తదానం చేసిన వారికి ఎంజీఎం వైద్యులు, సిబ్బంది సర్టిఫికెట్స్, ఫ్రూట్స్ ఉచితంగా అందించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంజీఎం బ్లడ్ బ్యాంక్ డాక్టర్ ఆశా దేవి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కే రాజేందర్ రెడ్డి, కెప్టెన్ పి.సతీష్, కెప్టెన్ డాక్టర్ ఎం.సదానందం, లెఫ్టినెంట్ ఎస్.స్వామి, లెఫ్టినెంట్ విష్ణు వర్దన్ రెడ్డి, సృజన్, సుబేదారి మేజర్ రఫీ, ఎన్సీఓ దీపక్, ఎల్బీ కాలేజీ, సీకేఎం, కేడీసీ, ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ, ఐటీ,ఐ అగ్రికల్చర్ కళాశాల ఎన్సీసీ క్యాండిడేట్స్ ఈ రక్తదాన శిబిరంలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# తెలంగాణ ప్రైవేటు ఉద్యోగుల సంఘం సర్వసభ్య సమావేశం



**వరంగల్ వాయిస్ :హైదరాబాద్ :** హైదరాబాద్ బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగుల సంఘం రాష్ట్రస్థాయి కార్యవర్గ సమావేశం ఘనంగా జరిగింది. ఈ కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 33 జిల్లాలలో వ్యవస్థాపక అధ్యక్షుడు సామ వెంకట్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు మియాపురం నాగేశ్వర్ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగుల సంఘం వరంగల్, హనుమకొండ నూతన అధ్యక్ష కార్యదర్శులను నియమించి నియామక పత్రాలను అందజేశారు. తెలంగాణ స్వరాష్ట్ర సాధనలో అన్యాయానికి గురవుతున్న అధ్యోగులకు అండగా 2006 సంవత్సరంలో తెలంగాణ ప్రైవేటు ఉద్యోగుల సంఘం స్థాపించబడింది. స్వతంత్ర తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కోసం ఎన్నో ఉద్యమాలు చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్న, ప్రైవేటు రంగాల్లో పనిచేస్తున్నఉద్యోగులకు అన్యాయం జరుగుతుంది. రాష్ట్రంలో అన్ని ప్రైవేటు సంస్థలు, కంపెనీలలో ప్రైవేటు ఉద్యోగులకు స్థానికంగా 75 శాతం రిజర్వేషన్ కల్పించాలనే ప్రత్యేక ఎజెండాతో సంఘాన్ని మరింత ముందుకు తీసుకెళ్లవలసిన సమయం వచ్చిందని వ్యవస్థాపక అధ్యక్షుడు సామ వెంకట్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు ముయపురం నాగేశ్వర్, ఉప అధ్యక్షుడు దాసి సాయిచంద్, తెలంగాణ లారీ యూనియన్ అసోసియేషన్ వేముల భూపాల్, వరంగల్ అధ్యక్షుడు సిద్దొజు నితీష్, బొల్లం శ్రీను, చిలుకూరి హరీష్, సద్దాం, తదితరులు పాల్గొన్నారు.

# ఐఎంఏ బిల్డింగ్ కమిటీ చైర్మన్ గా డాక్టర్ బందెల మోహన్ రావు



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** ఇండియన్ మెడికల్ అసోసియేషన్, వరంగల్ బ్రాంచ్ లో శనివారం పూర్వ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఐఎంఏ హాల్ లో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో వరంగల్ బ్రాంచ్ బిల్డింగ్ కమిటీ చైర్మన్ గా డాక్టర్ బందెల మోహన్ రావును ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ చైర్మన్ పదవి రెండు సంవత్సరాలు కొనసాగుతుంది. పూర్వ కమిటీ అధ్యక్షుడు ఘనంగా డాక్టర్ బందెల మోహన్ రావును ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ అన్వర్ మియా, డాక్టర్ నాగార్జున రెడ్డి, డాక్టర్ కస్తూరి ప్రమీల, డాక్టర్ సంధ్యారాణి, డాక్టర్ రాకేష్, డాక్టర్ ఆనంద్ బోకరే, డాక్టర్ సుధాకర్ రెడ్డి, డాక్టర్ అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** బాలల హక్కుల వారోత్సవాలలో భాగంగా గతవారం అనితా రెడ్డి ఆధ్వర్యంలో పిల్లలతో నిర్వహించిన ఓపెన్ హౌస్ కార్యక్రమంలో హనుమకొండలోని కృష్ణ కాలనీ, వాజ్ పేయి నగర్ కు చెందిన, స్లమ్ పిల్లలు తమ చదువుల కోసం పాఠ్యపుస్తకాలు, పుస్తకాలు కావాలని కోరారు. దీనిపై తక్షణమే స్పందించి శనివారం వారి విద్యా అవసరాలకు అనుగుణంగా కృష్ణ నగర్ కాలనీలోని 84 మంది ప్రభుత్వ ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాల నిరుపేద విద్యార్థులకు నోట్ పుస్తకాలు, ఇతర సామాగ్రిని అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా అనితా రెడ్డి మాట్లాడుతూ పిల్లల చదువులకు ప్రభుత్వం అనేక రకాలుగా సహాయం చేస్తున్న కూడా కుటుంబ ఆర్థిక స్థితిగతుల వలన పూర్తిస్థాయిలో విద్యా అవసరాలు, వారికి కావలసిన పరికరాలు అందట్లేదన్నారు. కాబట్టి, దీన్ని దృష్టిలో ఉంచుకొని నిరుపేద విద్యార్థుల విద్యకు సహకరించడానికి మా తోడ్పాటు మేము అందించామని తెలిపారు. ఈ అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పిల్లలకు సూచించారు. అంతేకాక ఉన్నతమైన లక్ష్యంతో మంచి చదువు చదవాలని వారిని అభినంది ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ భిక్షపతి, హెడ్మాస్టర్ హరి ప్రసాద్, ఎఫ్ఎంఎం సోషల్ సర్వీస్ సొసైటీ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఎర్ర శ్రీకాంత్, టీచర్ గంగాభవాని తదితరులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# పుష్ప–2 టిక్కెట్ ఉచితం

## గ్రాసరీ కొంటే ఉచిత వోచర్ ఇస్తామంటున్న బ్లింక్ ఇట్

ప్రముఖ ఈ కామర్స్ సంస్థ బ్లింక్ ఇట్ తమ వినియోగదారులకు బంఫర్ ఆఫర్ ప్రకటించింది. తమ యాప్‌లో గ్రాసరీలు ఆర్డర్ చేసుకున్నవారికి అల్లు అర్జున్ నటిస్తున్న పుష్ప 2 టికెట్ ఫ్రీగా ఇవ్వబోతున్నట్లు ప్రకటించింది. పాన్ ఇండియా మోస్ట్ అవైటెడ్ చిత్రం పుష్ప 2 డిసెంబర్ 5 ప్రేక్షకుల ముందుకు రానున్న విషయం తెలిసిందే. ఓవర్సీస్ అడ్వాన్స్ బుకింగ్స్ ఇప్పటికే మొదలుకాగా.. ఇండియాలో ఎప్పుడు బుకింగ్స్ స్టార్ట్ అవుతాయా అని మూవీ లవర్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే దేశవ్యాప్తంగా పుష్ప 2 సినిమాకి ఉన్న క్రేజ్‌ని వాడుకోవాలి అనుకున్న ప్రముఖ ఈ కామర్స్ సంస్థ బ్లింక్ ఇట్ తమ వినియోగదారులకు బంఫర్ ఆఫర్ ప్రకటించింది. తమ యాప్‌లో కిరాణా సమాన్లు కొనుకున్నవారికి పుష్ప 2 టికెట్ వోచర్ ఇవ్వబోతున్నట్లు ప్రకటించింది. అయితే రూ.999 కంటే ఎక్కువ ఆర్డర్ చేస్తేనే ఈ ఆఫర్ వర్తిస్తుందని తెలిపింది. ఈ ఆఫర్ నవంబర్ 23 నుంచి నవంబర్ 29 వరకు ఉంటుందని ప్రకటించింది.

### ఆ సాంగ్ లను మించి మరో సాంగ్ ..

ఇదిలావుంటే ఐటం సాంగ్‌ను విడుదల చేయనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. కిస్సిక్ అంటూ ఈ సాంగ్ రాబోతుండగా.. సుకుమార్, అల్లు అర్జున్ కాంబోలో వచ్చిన ఆ అంటే అమలాపురం, రింగ రింగా, ఊ అంటావా మావ సాంగ్‌లను మించి ఈ పాట ఉండబోతున్నట్లు తెలుస్తుంది.







# నటనలో అర్ధశతాబ్దం

## పూర్తి చేసుకున్న మోహన్ బాబు





తొలినాళ్లలో ఒక్కపూట భోజనం కరువే అని భావోద్వేగం మంచు మోహన్‌బాబు నటనా ప్రయాణంలో 50వ వసంతంలోకి అడుగు పెట్టారు. 50 ఏళ్ల సినీ ప్రయాణాన్ని పురస్కరించుకుని వచ్చే ఏడాది నవంబరు 22 వరకూ ప్రతినెలా ఓ వేడుకని నిర్వహించనున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించింది. అందులో మోహన్‌బాబు మాట్లాడుతూ భావోద్వేగంగా మాట్లాడారు. 'నా తల్లిదండ్రులు ఆశీస్సులు, నటనలో నాకు జన్మనిచ్చిన దాసరి నారాయణరావుగారి దీవెనలు నాపై ఎప్పుడూ ఉంటాయి. సీనియర్ ఎన్టీఆర్, ఏయన్నార్, కృష్ణ, శోభన్‌బాబు ఎప్పుడూ నన్ను వారి సొంత తమ్ముడిలా భావించారు. అన్నిటికంటే ముఖ్యంగా అభిమానుల ప్రేమాభిమానాలే నన్ను ఈ స్థాయికి తీసుకొచ్చాయి. 1975 మార్చి వరకు ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నాను. భోజనం కూడా దొరక్క ఎన్నో రోజులు ఇబ్బందులు పడ్డాను. నేడు మీ అందరితో (మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్) కలిసి భోజనం చేయాలని ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయమని విష్ణుని అడిగాను. 'మా' అధ్యక్షుడిగా విష్ణు ఎలా పనిచేస్తున్నారో ఎప్పటికప్పుడు తెలుసుకుంటూనే ఉన్నాను. 'మా' బిల్డింగ్ ఆలస్యం అవుతుందేమో కానీ విష్ణు చెప్పిన మాటను కచ్చితంగా నెరవేరుస్తాడు. దేశమే గర్వించదగ్గ మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్‌గా దీన్ని తీర్చిదిద్దుతున్నారు' అన్నారు. కులం కూడు పెట్టదని పెద్దలు చెబుతారు. నా కులం వాళ్లే నా సినిమా చూడమంటే ఒక్కడు చూడడు. నాకు అందరూ సమానమే. కులమతాలతో సంబంధం లేదు. అన్ని కులాలు ఒక్కటే. అందరూ నన్ను ఆశీర్వదించాలి. ఎన్నో మంచి పనులు చేశాను. వాటిని వేదికలపై చెప్పడం నాకు నచ్చదు. చనిపోయిన నటుడి భార్యకు ఉద్యోగం ఇప్పించాను. వాళ్ల పిల్లల్ని చదివించాను. ఆ పిల్లలు కూడా హీరోలు అయ్యారని విని సంతోషించాను. ఎంతో మంది పిల్లల్ని నేను చదివించాను. ఇలాంటి మంచి పనులు ఎప్పుడూ చేస్తూనే ఉంటాను. నా సినిమాల్లోనూ ఎంతోమందికి అవకాశాలు కల్పించాను. ఎవరికైనా చదువు విషయంలో ఇబ్బందులు ఉంటే నా యూనివర్సిటీ ఉందని మర్చిపోకండి' అన్నారు. ఇక కన్నప్ప చిత్రం గురించి చెబుతూ ఇది విష్ణు కెరీర్‌లో మైలు రాయి కావాలని కోరుకుంటున్నా' అన్నారు.

# నాగచైతన్య కొత్త సినిమా అనౌన్స్

స్టార్ హీరో అక్కినేని నాగచైతన్య కొత్త సినిమాను అనౌన్స్ చేశాడు. సాయి ధరమ్ తేజ్‌కి విరుపాక్ష లాంటి బ్లాక్ బస్టర్‌ను అందించిన దర్శకుడు కార్తీక్ వర్మ దర్శకత్వంలో చైతూ సినిమా చేయబోతున్నాడు. నాగ చైతన్య పుట్టినరోజు కానుకగా శనివారం ఈ ప్రాజెక్ట్‌ను ఆఫీషియల్‌గా అనౌన్స్ చేశారు. ఈ సందర్భంగా ఫస్ట్‌లుక్‌ని విడుదల చేశారు. ఎన్‌సీ24 అనే వర్కింగ్ టైటిల్‌తో వస్తున్న ఈ చిత్రం సూపర్ న్యాచురల్ థ్రిల్లర్‌గా రాబోతున్నట్లు తెలుస్తుంది. అయితే ఈ సినిమాలో కథానాయికగా పూజా హెగ్డేను తీసుకోబోతున్నారని టాక్ నడుస్తుంది. ఈ చిత్రాన్ని శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర బ్యానర్, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్‌లపై బోగవల్లి ప్రసాద్‌తో పాటు సుకుమార్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. మరోవైపు గతేడాది కస్టడీతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన చైతూ భారీ డిజాస్టర్‌ను అందుకున్నాడు. ఇక ప్రస్తుతం అతడి ఆశలన్ని తండేల్ చిత్రంపైనే ఉన్నాయి. కార్తికేయ 2 ఫేం చందూ మొండేటి దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమాలో సాయి పల్లవి కథానాయికగా నటిస్తుండగా.. గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై అల్లు అరవింద్ నిర్మిస్తున్నాడు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం వచ్చే ఏడాది ఫిబ్రవరి 07న ప్రేక్షకుల ముందుకు రానుంది.



# రెహమాన్ బాటలోనే మోహిని డే విడాకులు

## రెహమాన్‌తో సంబంధంపై సర్వత్రా పుకార్లు



ఆస్కార్ అవార్డ్ గ్రహీత, ప్రముఖ సంగీత దర్శకుడు, ఏ.ఆర్ రెహమాన్ సైరా బాను దంపతులు విడాకులు తీసుకోబోతున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే వీరిద్దరి విడాకులు ప్రకటించిన కాసేపటికే తన భర్త నుంచి విడిపోతున్నట్లు రెహమాన్ టీమ్‌లోని బాసిస్ట్ మోహిని డే వెల్లడిరచారు. గత కొన్నేళ్లుగా ఆమె రెహమన్ ట్రూప్‌లో కొనసాగుతున్నారు. అయితే రెహమాన్, మోహిని డే ఒకేరోజు విడాకులు ప్రకటించడంతో ఈ ఇద్దరి మధ్య సంబంధం ఉందని అందుకే విడాకులు తీసుకోబోతున్నారని వార్తలు వచ్చాయి. తాజాగా ఈ రూమర్స్‌పై మోహిని తన ఇన్‌స్టాగ్రామ్‌లో స్పందించింది. నేను విడాకులు ప్రకటించిన అనంతరం నుంచి మీ ఇంటర్వ్యూ కావాలని నాకు చాలా ఫోన్ కాల్స్ వస్తున్నాయి. అయితే వీళ్లంతా ఎందుకు ఇంటర్వ్యూ చేద్దాం అనుకుంటున్నారో నాకు తెలుసు. ఈ చెత్తకు ప్రచారమివ్వాలన్న ఆసక్తి నాకు ఏమాత్రం లేదు. ఇలాంటి రూమర్స్‌పై మాట్లాడి నా విలువైన సమయాన్ని వృథా చేసుకోలేను. దయచేసి నా వ్యక్తిగత గోప్యతను గౌరవించండి అంటూ మోహిని డే చెప్పుకొచ్చింది. మరోవైపు ఇదే విషయంపై రెహమాన్ భార్య సైరా తరఫు న్యాయవాది వందనా షా కూడా స్పందిస్తూ.. ఈ రూమర్స్‌లో ఎలాంటి నిజం లేదని క్లారిటీ ఇచ్చారు.

# ఘనంగా అనగాష్టమి వ్రతం

- దత్త క్షేత్రంలో వైభవంగా నిర్వహణ
- అధిక సంఖ్యలో హాజరైన భక్తులు



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** కార్తీకమాసం అష్టమిని పురస్కరించుకొని నగరంలోని ములుగు రోడ్డు ప్రాంతలో గల శ్రీ గణపతి సచ్చిధానంద వరద దత్త క్షేత్రంలో శనివారం సామూహిక శ్రీ అనగాష్టమి వ్రతం ఆచరించారు. అష్ట సిద్దులతో కూడిన దత్తాత్రేయ మూర్తి, అనగాష్టమి ఆచరించుట ద్వారా అష్టలక్ష్మల అనుగ్రహం, గురు అశీసులు కలుగుతాయని దత్త ప్రచారక్ కొక్కుల రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. వందల మంది భక్తులు ఈ వ్రతంలో పాల్గొని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భక్తులందిరికీ అన్నదానం జరిగింది. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు వైవీ వామన్ రావు, యుగంధర్ శ్రీనివాస్, అర్చకులు రాపాక గోపి కృష్ణ శర్మ భక్తులు పాల్గొన్నారు.



# దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలి

- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క
- జిల్లా స్థాయి క్రీడోత్సవాలు ప్రారంభం

**వరంగల్ వాయిస్, ములుగు :** దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలని పంచాయతిరాజ్ శాఖ మంత్రి సీతక్క కోరారు. వారిని చిన్నచూపు చూడవద్దన్నారు. వారు అధైర్య పడకుండా ముందడుగు వేయాలన్నారు. అందుకు ప్రభుత్వం కూడా అండగా నిలుస్తుందన్నారు. ములుగు జిల్లా కేంద్రంలోని జూనియర్ కళాశాల మైదానంలో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి క్రీడోత్సవలను జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్, గ్రంథాలయాల చైర్మన్ రవి చందర్ లతో కలిసి మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అవయవాలు పని చేయడంలేదని ఆవేదన చెందకుండా క్రీడలు, ఉద్యోగ రంగాల్లో రాణించాలన్నారు. గత పాలకులు దివ్యాంగుల సంక్షేమం కోసం రూ.10 కోట్లు కేటాయించగా నేటి ప్రజా ప్రభుత్వం రూ.50 కోట్లు కేటాయించిందన్నారు. ఇప్పటికే వికలాంగులకు పలు రకాల వాహనాలు అందిస్తుండగా రానున్న రోజుల్లో వారు వ్యాపారాలు చేసుకుని అభివృద్ధి చెందడానికి మాడల్ వాహనాలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి కె.శిరీష, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తూల రవి, దివ్యాంగుల సంఘాల నాయకులు, దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యంతోనే సమాజాభివృద్ధి..

సరైన ఆరోగ్యంతోనే సమాజాభివృద్ధి సాధ్యమని, ఉద్యోగుల ఆరోగ్య పట్ల ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినదని రాష్ట్ర మంత్రి సీతక్క అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాల మైదానంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ హైదారాబాద్ సంయుక్తంగా జిల్లాలోని అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, మహిళలకు ఏర్పాటు చేసిన ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్ష శిబిరాన్ని ఆమె జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, చైర్మన్ డాక్టర్ సుంకవెల్లి చిన్నబాబు, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ ఇ.అక్కేశ్వర్ రావు, గ్రంథాలయ చైర్మన్ రవి చందర్ లతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. రోగం వచ్చాక బాధపడేకన్నా రాకముందే దానిని నివారించడం చాలా ముఖ్యమన్నారు. గాలి, నీరు, నేల ఇలా పంచభూతాలు కలుషితం అవుతున్న ఈరోజుల్లో తినే ఆహారంలో జరిగే కల్తీ వల్ల చాలా వరకు ప్రమాదకరమైన క్యాన్సర్లు వస్తున్నందున ప్రజలంతా నాణ్యమైన కల్తీ లేని ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి కె.శిరీష, తాడ్వాయి సీడీపీఓ జి.మల్లీశ్వరి, ఐసీఐసీఐ బ్యాంక్ మేనేజర్ దమ్మ శ్రీకాంత్, హైసియా అధ్యక్షులు ప్రశాంత్ నందెల్లా, నిర్మాణ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు మయూర్, అన్ని సెక్టార్ల సూపర్వైజర్లు, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలనపై కళాయాత్ర..

జిల్లా పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలపై రెండు బృందాల కళాకారులు గ్రామాలలో ప్రజలకు ప్రభుత్వ వివరాలను తెలియజేస్తున్న సందర్భంగా శనివారం జిల్లా కేంద్రంలో కళాకారులు నిర్వహిస్తున్న కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రజాపాలన కళాయాత్ర ప్రభుత్వ కార్యక్రమాలపై విస్తృత ప్రచారం చేయాలని, మరో రెండు గ్యారెంటీ త్వరలో అమలు చేయనున్న నేపథ్యంలో ప్రభుత్వ పథకాలను ప్రజలకు తెలిసేలా ప్రచారం చేయాలన్నారు. గ్రామాల్లో ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్న వారి వివరాలను సేకరించాలని సీతక్క సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ బానోతు రవిచందర్, జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి ఎండి.రఫిక్, పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, టీఎస్ఎస్ కళాకారులు, తదితరులు పాల్గొన్నారు.





# పాదర్శకంగా సర్వే వివరాలు

- హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య
- పలు హాస్టళ్లలో తనిఖీలు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సామాజిక ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ కుల సర్వే( సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే) వివరాలను అత్యంత జాగ్రత్తగా ఈ నెల 30వ తేదీ నాటికి ఆన్ లైన్ లో నమోదు చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో సర్వే వివరాలను డేటా ఎంట్రీ చేయడంపై ఎంపీడీవోలు, ఎంపీఓ, ఎంపీఎస్వోలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ఎన్యుమరేటర్లు చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే వివరాలను డేటా ఎంట్రీ ఆపరేటర్లు శనివారం నుంచి 30వ తేదీ వరకు వివరాల నమోదును పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో ముఖ్య ప్రణాళిక అధికారి సత్యనారాయణ రెడ్డి, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ రవీందర్, ఈడీఎం శ్రీధర్, ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఎంపీఎస్ఓలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం..

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంతోపాటు గురుకులాలు, కెజీబీవీలు, హాస్టల్స్, అంగన్వాడీ కేంద్రాలలో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించే విధంగా చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శనివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో పాఠశాలలు, హాస్టల్స్ విద్యార్థులకు అందించే భోజనంపై వివిధ శాఖల అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో డీఆర్వో వైవీ గణేష్, బీసీ వెల్ఫేర్ డీడీ రాం రెడ్డి, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి కొమరయ్య, సివిల్ సప్లై కార్పొరేషన్ మేనేజర్ మహేందర్, గురుకులాలు, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు పాల్గొన్నారు.

## పలు హాస్టళ్లలో తనిఖీ..

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం పలు హాస్టళ్లను జిల్లా అధికారులు తనిఖీ చేశారు. దీనిలో భాగంగా హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని ఎస్సీ బాయ్స్ హాస్టల్ ను బీసీ వెల్ఫేర్ డీడీ రామ్ రెడ్డి తనిఖీ చేశారు. విద్యార్థులకు వండిన ఆహారాన్ని పరిశీలించారు. స్టోర్ రూమ్ లో ఉన్న వంట సామగ్రితో పాటు వంటగదిని పరిశీలించారు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాలరాజు ఒగ్లాపూర్ లోని మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్, పరకాలలోని ఎస్సీ బాలికల పాఠశాల కళాశాల, హనుమకొండలోని మైనారిటీ బాలుర పాఠశాల, కళాశాలలను తనిఖీ చేశారు. జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి మల్లయ్య వేలేరు మండలంలోని కేజీబీవీ పాఠశాల కళాశాలను తనిఖీ చేశారు. జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డీడీ శ్రీలత కాజీపేటలోని బీసీ బాయ్స్ హాస్టల్ తో పాటు హనుమకొండలోని బీసీ కాలేజ్ బాయ్స్ హాస్టల్ ను తనిఖీ చేశారు.

# ప్రజలకు అందుబాటులో ఉంటా..

- సమస్యలను పరిష్కరిస్తా..
- మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు తెలిపారు. ఓ సిటీలోని క్యాంప్ కార్యాలయంలో శనివారం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని వివిధ వర్గాల ప్రజలు క్యాంప్ ఆఫీసుకు చేరుకుని తమ సమస్యలను కొండా మురళికి విన్నవించారు. వారి సాధకబాధకాలను సహృదయంతో విన్నారు. సంబంధిత పలువురు అధికారులతో అప్పటికప్పుడే ఫోన్ లో మాట్లాడి సమస్యలను పరిష్కరించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. బడుగు, బలహీన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదన్నారు. ఎలాంటి ఆపద సమయాల్లో నైనా కొండా దంపతులు మీకు అండగా ఉంటారని మురళీధర్ రావు వారికి భరోసానిచ్చారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com